

గొల్లపూడి మారుతీరావు

ఆ యింటికి వచ్చిన నాలుగురోజులకి కాని నాకు పట్టబోయే అదృష్టం అనుభవంలోకి రాలేదు. అప్పుడూ తెలిసేదే కాదు, ఆ కిటికీవల్ల కాకపోతే.

దేశానికి అయిదువందల మైళ్ళ దూరంలో విసిరేసినట్టు రెండు శతాబ్దాలు బ్రతికివచ్చాక - మన మనుషులూ, మన భాషా తెలిసినచోటుకి వచ్చినందుకే సంతోషంతో ఉక్కిరిబిక్కిరవుతోంది మా ఆవిడ. కాని నాకు పెద్ద తేడా కనిపించలేదు. తెలుగురూపాయికీ, పంజాబీ రూపాయికీ తేడాలేదు. ఇక్కడా యిల్లు అద్దెకి తీసుకోవాలి, బియ్యం కొనాలి, పాలు పోయించుకోవాలి, పనిమనిషి తప్పదు. కరెంటుబిల్లులూ, కర్రల కొట్లూ, కాఫీపొడి దుకాణం ఖాతాలూ - యివేనీ తప్పవు. పోతే, యిక్కడ మరో కొత్త యిబ్బంది కనిపించింది. మా ఆవిడా నేనూ ఎప్పుడన్నా ఘర్షణ పడితే, పంజాబీవాళ్ళకి అర్థమయేదికాదు. ఇక్కడ చక్కగా పక్కవాళ్ళకి అర్థమవుతుంది. అంతేకాదు - తెలుగువాళ్ళ

ఆచారంప్రకారం ఆడవాళ్ళు మరినాలుగు యిళ్ళకు ప్రచారం చేసే ప్రమాదంవుంది. ఇవన్నీ మా ఆవిడకి క్రమశః అనుభవం లోకి వస్తాయని తెలుసు. అయినా బదిలీ మాట వినగానే ఉధృతమయిన 'అల'లాగ ఆమెలో పొంగివచ్చిన ఉత్సాహాన్ని అణగద్రొక్కలేకపోయాను

ఊరు ఏదయితేనేం? ఢిల్లీలో కుతుబ్ మినారూ ఇటుకలూ సున్నంతోనే నిర్మించారు; ఈ వూళ్ళో నలభై రూపాయల అద్దెకొంపా సున్నం యిటుకలతోనే నిర్మించారు. మొదటి నాలుగురోజులూ ఉన్న సామాన్లని కనిపించే నాలుగు మూలలకీ సర్దడంలో నిమగ్నమయిపోయింది మాఆవిడ. నా రచనావ్యాసంగం కొనసాగడానికి కాస్త పాటి గాలీ, వెలుగూ వచ్చే చోటుకోసం వెదుక్కోడం ప్రారంభించాను నేను. అదిగో, అప్పుడు కనిపించింది — సరుగుడు చెక్కలతో పూర్తిగా విడకుండా మూసేసిన పడమటివేపు కిటికీ. అది తెరిస్తే మంచి గాలి వేసే యోగ్యత వుంది ఆ గదికి. కాని యిదివరకు ఉన్నవాళ్ళు ఎందుకనో తెరవలేదు. ఒక మధ్యాహ్నమంతా పూర్తిగా శ్రమపడి చివరికి దాన్ని సాధించాను. సరుగుడు చెక్కలు విడిపోయాయి. తలుపులు తెరుచుకున్నాయి. ఆనకట్ట తెగిపోయిన ప్రవాహంలాగ తలుపుల్ని తోసుకుని వెలుగు ఆ గదిలోకి ప్రవహించింది. నల్లటిగోడలు క్షణమాత్రం తెల్లబోయినట్టు వెలిగాయి. బూజులు గాజుతోరణాల్లాగ కనిపించాయి ఇక నా ఆనందానికి మేరలేదు— వీటన్నిటిమధ్యా సహజీవనం సాధ్యమయినందుకు కాదు, ఇవన్నీ వున్నా చక్కని గాలీ వెలుతురూ సంప్రాప్తమయినందుకు.

ఆ కిటికీదగ్గర కుర్చీ వేసుకొని తనివి తీరా గాలిని ఊపిరితిత్తులనిండా నింపుకొన్నాను. అప్పుడప్పుడు కింద మురుగు కాలవరుచి తెలిస్తే నేంగాక?— ఆ వెలుగునే నూహించలేనిది. రెండు కార్లు అటునుంచి వెళ్ళాయి — నాటి వెనక రోడ్డంతా బెదిరిపోయిన మనస్సులాగ కలవరపడింది. ఆ దుమ్ము మా కిటికీ వరకూ వచ్చింది కాని మా కిటికీని పరిరక్షిస్తున్నట్టు ఓ బొగడచెట్టు నీడుంది. మంచివారిమీదా, చెడ్డవారిమీదా వర్షించే భగవంతుడి కరుణలాగ— కింద మురుగు కాలవమీదా, దుమ్మురోడ్డుమీదా దాని పువ్వులు పరుచుకున్నాయి. చెడు లేకపోతే మంచికి విలువ ఏముంది?

ఇవన్నీ చూస్తూ హఠాత్తుగా తలెత్తాను. అప్పుడు — నిజంగా అప్పుడే — నాకు పట్టిన అదృష్టం కనులముందు గట్టింది.

అప్పుడే నాకు ఆమె దర్శనమిచ్చింది.

ఆ వీధివెంబడి చాలామంది కాలేజీ అమ్మాయిలు నడిచిపోతున్నారు. వీధి




చివరన కాలవనీళ్ళకు చాలామంది ప్రౌఢలు మట్టికుండల్నీ, యౌవనభారాన్నీ మోసుకొని ప్రయాణం సాగిస్తున్నారు. వీధి వీధంతా బొగడచెట్టులాగే విరిసిన సుమధామంలాగ కనిపిస్తోంది. కాని యిందరిమధ్యా, యిన్నిటిమధ్యా ఒక్క ఆమే నన్ను ఆకర్షించింది.

దిగ్భ్రాంతుడి నయ్యాను. ఆ సౌందర్యపు పలకరింతకి కళ్ళు తిరిగాయి – ఆ గుప్త సౌందర్యాన్ని అచేతనంగా చూస్తూ కూర్చుండిపోయాను. అలా ఎన్ని క్షణాలో, ఎన్ని యుగాలో గుర్తులేదు. క్రమంగా ఆమె కనుమరుగయింది– కల లోంచి జారిపోయినట్టు మాయమయింది.

ఆ జ్ఞాపకంలో రాత్రంతా తల్లడిల్లిపోయాను. కంటిమీద నిద్రలేదు. కొందరి సౌందర్యం ఉన్మత్తుడిని చేస్తే, కొందరి సౌందర్యం పరవశుణ్ని చేసి బుజ్జగిస్తుంది. లాలించి జోలపాడుతుంది. దిగ్భ్రమతో, తన్మయత్వంతో, అచేతనుణ్ని చేస్తుంది; అలరిస్తుంది. అటువంటి సౌందర్యం ఆమెది.

మర్నాడంతా అదేదృష్టి. అదే ఆలోచన. ఆ సమయానికే వస్తుంది గావును– ఎదురుచూస్తూ కుర్చీలో కూర్చున్నాను. సాయంకాల మయేసరికి మా వీధంతా అందమయిన అమ్మాయిలతో అలంకరించుకొంటోంది. కాని ఒక్క ఆమె కోసమే కళ్ళలో వత్తులు వేసుకు ఎదురు చూస్తున్నాను. ఇంతలో – ఇంతలో, అవును – ఆమె కనిపించింది.

నిరీక్షణలోనూ ఆనందం ఉన్న దను కొంటాను. ఆమెని చూస్తూ నిశ్చేష్టుడ నయాను. తారుణ్యపు తొలిఛాయలు ఆమె చెక్కిళ్ళమీద కనిపించాయి. ఎర్రటి కెంపులాంటి చీరె, ఆకాశానికి ఎగసిన అగ్నిశిఖలాగ వుంది. తనని చూసే కళ్ళని గమనిస్తూ ఆమెమనస్సు కుంచుకపోతుందేమో! మరీ జాగ్రత్తగా పరికిస్తే ముఖంలో ఎరుపు పల్చనవు తోంది. రంగు మారుతోంది. ఎంతటి సుప్త సౌందర్యం అది!

మొదటి రెండు మూడు రోజులూ గుర్తించలేదు మా ఆవిడ. కాని రాను రాను నా ఏకాగ్రతనూ, దృష్టినీ పసిగ ట్టింది. ఆ సమయానికి ఆ కుర్చీలో చేరా లనే నా తపన ఆమె మనస్సుకి శూలం పోటులా వుండివుంటుంది. చెప్పని, చెప్పలేని బాధ అది. తనని మరచి, నా మనస్సుని ఎవరో ఆకర్షించు కొంటున్నా రని చింత. అయినా యిది చాలాకాలం నేను గుర్తించలేకపోయాను.

''ఎందుకండీ అక్కడే కూచుం టారు? చలిగాలికి ఆరోగ్యం చెడుతుంది.'' అని నెపం పెట్టింది ఒకటి రెండుసార్లు.

అయినా చలించలేదు. ఏదో సాకు చెప్పి తప్పించుకొన్నాను.

రానురానూ ఆమెను చూడడం వ్యసన మయింది నాకు. ఆరాధన అంటే యిదేగావును.

ఒక్కోరోజు ఆమె కనిపించేదికాదు. ఆ రోజు ఆకాశం మబ్బు పట్టేది. త్వరగా చీకటి వ్యాపించేది - ప్రపంచాన్నీ, నా మనస్సునీ.

కాని మరునాడు మళ్ళీ - యౌవనం పొలిమేరల్లో తల వొంచుకు నడుస్తున్న తారుణ్యమూర్తిగా, ఎర్రని తాంబూలం చర్వణంలో తామసాన్ని కలిగించే పెద్ద ముత్తయిదువలాగ, ఒకసారి చిరు నవ్వుతో, ఒకసారి ఎర్రటి కోపంతో, ఒక్కోసారి చెప్పరాని దిగులుతో కుంచుక పోయినట్టూ కనిపించేది.

ఆమెని చూస్తూ-జీవితంలోని అపూర్వ మయిన ఆశల్ని ఒకసారి ఊహించుకో గలిగితే, అనూహ్యమయిన గాధాతోర ణాల్ని ఒకసారి ఊహించుకొనేవాడిని. అలాంటి సందర్భాలలో ఆమెముఖం దిగాలు పడివుండేది. ఆ దిగులు చూసి గుండెల్లో కత్తి దించుకోవా లన్నంత దుఃఖం కలిగేది. చేతనయితే ఆమె దుఃఖం తీర్చలేనా అనిపించేది. ఆమె కష్టాల్ని ఊహించుకొంటూ అలాగే కిటికీ దగ్గర తపస్సు చేసేవాడిని. ఆ సందర్భ ములో కళ్ళు అశ్రుసిక్తా లయేవి. మా ఆవిడ ఎప్పుడో నన్ను తట్టిలేపి, నా కన్నీరు చూసి దిగ్భ్రాంతి చెందేది. అప్ప టికి చీకటిపడి, ఆమె ఎప్పుడో నా కళ్ళ ముందునుంచి జారిపోయేది

రోజులు గడిచిపోతున్నాయి. ఆమె ఆలోచనలతో నా జీవనధోరణిలో కొత్త ఉత్సాహం, ఆశా పుంజుకొంది, ప్రతీ



ఉదయం కొత్తరుచులను చూపుతూ మేలుకొలిపేటట్టు భావించేవాడిని. దర్శన మాత్రంలో జీవన సరళినే ప్రభావితం చేయగల ఈ సౌందర్యమూర్తి ఇంకా ముందుగానే నా జీవితంలోకి ఎందుకు ప్రవేశించలేదా అని అనుకొనేవాడిని.

ఆమెతో ఎందుకు మాట్లాడకూడదు? – 'కూడదు, అసలు ఆ అవసరంలేదు' అనుకొన్నాను. మాటలకి అతీతమయిన భాష మమ్మల్నిద్దరినీ ఒకటి చేసింది. ఆ భాషకి అతీతమయినది ఏదీ ఇక మా నాలుకలు ఉచ్చరించలేవు.

కాని క్రమంగా మా ఆవిడ దిగులు పడడం, నిర్జీవంగా మారడం గమనించాను. చెక్కిళ్ళు తెల్లబడ్డాయి. నేను చేసే పలకరింతలో ఆవిడకి నమ్మకం పోయినది. నా ప్రతిపనినీ అనుమానంతో పరికించ సాగింది. నా మాటల్ని ఇదివరకు లాగ నమ్మడంలేదు. నా సాహిత్యాభిలాష ఒక దొంగపనికి ఆసరాగా చేసు

కొన్న 'మిష' అనుకోవడం గమనించాను. పద్యం రాయాలని కలం పడితే–ఎప్పుడూ లేనిది – వెక్కిరించడం ప్రారంభించింది. ఇక సాయంకాల మయితే పిచ్చిపట్టినట్టు సాధింపులూ, అకారణంగా ఏడుపులూ ప్రారంభించింది.

ఆ అమృతమూర్తికయి నిరీక్షణా మాధుర్యాన్ని ఈమె వమ్ము చేస్తున్నట్టు అనుకొనేవాడిని. మా యిద్దరి ఏకాంతాన్నీ ఎవరికీ తెలియనివ్వకూడ దనుకొనే నా అభీష్టం నిలిచేలాగలేదు.

ఆనాటి సాయంకాలం ప్రత్యేకమయిన అలంకరణలతో ప్రత్యక్ష మయింది ఆమె. అప్రత్యాశిత మయిన సౌందర్య సందర్శనానందంలో లీనమయిన నాకు, మా ఆవిడ దుఃఖం అంకుశప్రాయ మయి, నిజప్రపంచంలోకి వచ్చాను. ఆమె ఎక్కువ సేపు నాకు కనిపించదని తెలుసు. ఆ మూగసంభాషణలు యి కెంతోకాలం సాగవనీ తెలుసు. అయినా మా ఆవిడని దాటిపోయే దెలా?– విసుగేసింది, దుఃఖం వచ్చింది. చటుక్కున లేచి మా ఆవిడ ముందుకి వచ్చాను. 'ఏమిటి నీ బాధ?" అని అడిగాను. చెప్పదు. పైగా నన్ను చూసి మరింత బోరుమంది. ఆ క్షణంలో ఆమెను చూసి నా గుండె నీరయింది. కరచరణాలు ఆడలేదు. ఇక నా ఏకాంతము, నా రహస్యం ఎంతోకాలం దాగదని గ్రహించాను. ఇక నిస్సహాయుడ నయాను. మా ఆవిడ బుజంపట్టుకొని కిటికీదగ్గరికి తీసుకొచ్చాను.

"మీ రెవరినో చూస్తున్నారు. మీ యిద్దరిమధ్యా ఈ రాయబారాల్ని గమనిస్తూనే వున్నాను. నేను చచ్చినా ఆమె ముఖం చూడను–చూడనుగాక చూడను," అని కేకలు వేస్తోంది మా ఆవిడ ... వెంటనే నోరుమూశాను. తలెత్తి ఆమెను చూపించాను. అంతే. చూస్తూనే మా ఆవిడ నిర్ఘాంతపోయింది. ఆ కళ్ళలో విస్మయం, ఆశ్చర్యం ఏమని చెప్పను? – అయినా నమ్మకం చాలనట్టుంది – లేదా నేను మభ్యపెడుతున్నా ననుకొంది గావును – "నన్ను మోసం చెయ్యటోకండి," అంది కాస్త ఆగి.

"లేదు లేదు," అన్నాను విశ్వాసంతో; "అటు చూడు. రోజూ నేను చూసేది ఆమెనే – ఆమె ఎవ రనుకొన్నావు?"

"ఎవరు?" అంది అర్థంకాక.

"సంధ్య – ప్రతిరోజూ పడమటి ఆకాశాన్ని వెలిగించే పచ్చటి పెద్దముత్తయిదువ – సంధ్యాదేవి ఆ పెదవులమీద కెందామరలు చూడు. చెక్కిళ్ళలో ఎరుపు చూడు. ఆమె నిత్యయౌవని; ఆమె సౌందర్యానికి ఎవరూ మూర్ఛపోరు!"

నా ధోరణికి మా ఆవిడ ఒక్క చిన్నవ్వు.

ఇంతలో దీపాలు వెలిగించారు.

సంధ్య ముఖం జేగు రవుతోంది.

మా ఆవిడ మంగళసూత్రం కళ్ళ కద్దుకొని తృప్తిగా నా కళ్ళలోకి చూసే లోపలికి వెళ్ళిపోయింది–సంధ్యనీ నన్నూ ఏకాంతములో వదిలేసి.

— —